### నేడు అధికారులతో మాజీ మంత్రి,, ఎమ్మెల్యే
## సబితా ఇంద్రారెడ్డి సమీక్షా సమావేశం



బడంగ్‌పేట్, మే 2: బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు ఇరిగేషన్, మున్సిపల్, ఎస్ఎన్‌డీపీ అధికారులతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు మీర్‌పేట్‌లో ఉన్న మంత్రాల చెరువు అభివృద్ధి పనులను పరిశీలించనున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించనున్నారు. అన్ని విభాగాల అధికారులు హాజరుకావాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు.

## సీఎస్‌కు టీఎన్జీవోస్ శుభాకాంక్షలు



రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి(సీఎస్)గా నియమితులైన రామకృష్ణారావుని శుక్రవారం టీఎన్జీవోస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ ఆధ్వర్యంలో అసోసియేట్ ప్రెసిడెంట్ సత్యనారాయణ గౌడ్, టీఎన్జీవోస్ వైస్ ప్రెసిడెంట్, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ఎంప్లాయీస్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చిలక నరసింహారెడ్డి, కార్యదర్శి ముక్రం సీ ఎస్ రామకృష్ణారావుని మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

– మలక్ పేట, మే 2

### జూన్ చివరిలోగా కొత్త మహిళా సంఘాలు

మియాపూర్, మే 2: సర్కిల్ పరిధిలో జూన్ చివరి కల్లా కొత్త మహిళా సంఘాలను ఏర్పాటు చేయాలని చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి సూచించారు. వార్డుల వారీగా ప్రత్యేక బృందాలు పర్యటించి ప్రతి మహిళను సభ్యురాలిగా చేసేందుకు కృషి చేయాలని స్పష్టం చేశారు. చందానగర్ సర్కిల్ టీఎల్ఎఫ్ ప్రత్యేక సమావేశం శుక్రవారం కార్యాలయంలోని సమావేశం మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్కిల్ వ్యాప్తంగా 3782 నూతన సంఘాల ఏర్పాటును గడువులోగా పూర్తి చేయాలన్నారు. మహిళలలో పొదుపు లక్ష్యాన్ని పెంపొందించాలని మోహన్‌రెడ్డి తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకానికి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న వారు దరఖాస్తులు సర్కిల్ కార్యాలయంలో అందజేయాలన్నారు. అర్హులైన వారు పెన్షన్ దరఖాస్తులను సర్కిల్ కార్యాలయంలో సమర్పించాలని మోహన్‌రెడ్డి కోరారు.

# బడంగ్‌పేట్‌లో అంచనాలకు మించి పనులు

- ఉన్నది రూ.6 కోట్లు బడ్జెట్
- వందల కోట్ల పనులకు అడ్డగోలుగా తీర్మానాలు
- అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రత్యేక అధికారి



మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ప్రత్యేక అధికారి శ్రీనివాస్ రెడ్డి( ఫైల్ )

బడంగ్ పేట్, మే 2: బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో బడ్జెట్ ఉన్నది 6 కోట్ల అయితే వందల కోట్ల పనులు చేయడంపై చర్చనీయాంశంగా మారింది. అంచనాలకు మించి అభివృద్ధి పనులు చేయడం పట్ల ఆరోపణలు వస్తున్నాయి. అడ్డగోలుగా పనులు చేయడం పట్ల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ రెడ్డి మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇటీవల మున్సిపల్ అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం మున్సిపల్ కార్పొరేషన్ లో ఉన్న నిధులు ఎన్ని ఉన్నాయని ఆరా తీశారు. అసలు చేసిన పనులకు ఇవ్వవలసినది ఎంత ఉందని ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంకా చేయవలసిన పెండింగ్ పనులు ఎన్ని ఉన్నాయో వాటి జాబితా తయారు చేయాలన్నారు. ముందస్తు చేసిన పనులు ఎన్ని, వాటికి ఎంత ఇవ్వాలని అధికారులను అడిగి వివరాలు తీసుకున్నారు. ప్రస్తుతం ఎన్ని పనులకు ఏ ఏ ఎజెండాలో ఎన్ని తీర్మానాలు చేశారో వివరాలతో మరో సమావేశంలో చర్చిస్తానని అధికారులతో అన్నట్టు తెలిసింది.

### పెండింగ్ పనుల వివరాలు..

ఫిబ్రవరి 2024 లో కౌన్సిల్ మీటింగ్‌లో తీర్మానం చేసిన పనులు 407. అందులో పూర్తి చేసిన పనులు 356. పెండింగ్ పనులు 68 ఉన్నాయి. చేసిన పనులకు రూ.3.36 కోట్లు చెల్లించవలసి ఉంది. ఆగస్టు 2024 కౌన్సిల్ సమావేశంలో 408 పనులకు తీర్మానం చేశారు. 262 పనులను పూర్తి చేశారు. 145 పెండింగ్ లో ఉన్నాయి. చేసిన పనులకు రూ. 13.08 కోట్లు చెల్లించవలసి ఉంది. డిసెంబర్ 2024 సంవత్సరంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో 538 పనులకు తీర్మానం చేశారు. 232 పనులు పూర్తి చేశారు. 322 పనులు పెండింగ్ లో ఉన్నాయి. చేసిన పనులకు రూ. 28.06 కోట్లు ఇవ్వవలసి ఉంది. ప్రస్తుతం చేసిన పనులన్నింటికీ రూ 45.88 కోట్లు చెల్లించవలసి ఉంది. బడ్జెట్ మాత్రం 6 కోట్ల ఉంది. ఈ డబ్బులన్నీ ఎక్కడి నుంచి తీసుకువస్తారని ప్రత్యేక అధికారి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

### కార్పొరేషన్‌లో ఉన్న బడ్జెట్ రూ. 6 కోట్లు

బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రస్తుతం రూ. 6 కోట్ల నిలువ బడ్జెట్ ఉన్నట్లు అకౌంటెంట్ పేర్కొంటున్నారు. చేసిన అభివృద్ధి పనులకు రూ. 45.88 కోట్లు కాంట్రాక్టర్లకు ఇవ్వవలసి ఉందని డీఈ వెంకన్న పేర్కొన్నారు. ముందస్తు చేసిన 50 పనుల లెక్కలు ఇంకా తేల్చలేదు. ఇంకా తీర్మానాలు చేసిన పనులు చేయవలసి ఉంది. బడ్జెట్ అంచనాలకు మించి పనులు చేయించిన అధికారుల తీరుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చాలామంది పనులు చేసిన కాంట్రాక్టర్లకు కోట్లలో డబ్బులు ఇవ్వవలసి ఉంది. అధికారులు మాత్రం ఎక్కువ పర్సంటేజ్ ఎవరైతే ఇస్తారో వారి చెక్కులను మాత్రమే ముందు రాస్తున్నారని చాలామంది కాంట్రాక్టర్లు ఇప్పటికే ఫిర్యాదులు చేశారు. కొంతమంది విజిలెన్స్ అధికారులకు కూడా ఫిర్యాదులు చేశారు. ఇంజనీరింగ్ విభాగంలో జరుగుతున్న అవకతవకలపై అనేక ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి.

### అడ్డగోలుగా తీర్మానాలు..

జనవరి 2025 నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో తీర్మానాలకు లెక్కలే లేవు. అడ్డగోలుగా తీర్మానాలు చేశారన్న వాదనలు బలంగానే ఉన్నాయి. అసలు మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉన్న నిధులు రూ. 6 కోట్లు మాత్రమేనని గణాంకాలు, అధికారులు పేర్కొంటున్నారు. నిబంధనల ప్రకారం సిబ్బంది జీత భత్యాలకు సంబంధించి నాలుగు నెలల వరకు సరిపడు బడ్జెట్ ఉండాలి. నిధులు లేకుండానే అడ్డగోలుగా తీర్మానాలు చేయడం జరిగింది. జనవరి మాసంలో జరిగిన కౌన్సిల్ తీర్మానాలను పక్కన పెట్టే ఆలోచన ఉన్నట్లు తెలిసింది. వీటన్నింటిని అధికారులు ఎలా అధిగమిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

ఇప్పటికే చాలామంది విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు చేశారు. కాంట్రాక్టర్లే ఇంజనీరింగ్ విభాగంలో జరిగిన ఒకతవకలపై విజిలెన్స్ ఎంక్వయిరీ చేయించాలని ఫిర్యాదులు చేశారు. ఈ చిక్కుముడులకు సమాధానం ఎప్పుడు దొరుకుతుందో వేచి చూడాల్సిందే.

### ముందస్తు చేసిన పనుల లెక్క తేలేది ఎప్పుడో..

మున్సిపల్ కార్పొరేషన్‌లో అడ్డగోలుగా ముందస్తు పనులు చేశారు. చేసిన కాంట్రాక్టర్లకు డబ్బులు ఇవ్వలేదు ఇప్పటివరకు. పనులు ఒకరు చేస్తే టెండర్ మరొకరికి వచ్చింది. వాటిని తేల్చకుండా అధికారులు అలాగే మూసి పెట్టారు. దీంతో కాంట్రాక్టర్ల మధ్యన నిత్యం గొడవలు జరుగుతూనే ఉన్నాయి. అధికారులు చెప్తేనే ముందస్తు పనులు చేసినట్లు కాంట్రాక్టర్లు చెప్తున్నారు. అధికారులు మాత్రం 50 వర్కులు మాత్రమే చేసినట్లు చెప్తున్నారు. ఈ ముందస్తు చేసిన పనుల చిక్కుముడి వీడేది ఎప్పుడోనని కాంట్రాక్టర్లు ఆందోళనలో ఉన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సైదాబాద్, మే 2: సైదాబాద్ పూసల బస్తీలోని సిల్వర్ డ్రాప్స్ హై స్కూల్ 1999–2000 పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. విద్యార్థులు పాఠశాలతో తమకు ఉన్న అనుబంధం, టీచర్లతో తమకు ఉన్న అభిమానాన్ని పంచుకున్నారు. ముఖ్య అతిథిగా ప్రస్తుత పాఠశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ అన్వేష్ హాజరు కాగా, ఉపాధ్యాయులు వింజమూరి ఈశ్వర్, శ్రీనివాస్, శోభారెడ్డి, వసంత, సంగమణి, మంజుల పాల్గొని విద్యార్థులతో తమకు ఉన్న అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జయప్రదం కావడానికి కృషిచేసిన రాజేష్, వెంకటేష్‌ను సహ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సరిత, రవి నాయక్, సుజాత, తులసి, జ్యోతి, పరుశురాం, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి సహకరిస్తా: ఎమ్మెల్యే



ఆలయాల నమూనా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

మన్సూరాబాద్, మే 2: మన్సూరాబాద్ డివిజన్ జడ్జెస్ కాలనీ ఫేస్–1లో త్వరలో పునరుద్ధరించనున్న ఎల్లమ్మ, బంగార పోచమ్మ దేవాలయ నిర్మాణ పనుల పోస్టర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, జడ్జెస్ కాలనీ ఫేస్ –1 లో నిర్మించనున్న దేవాలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. గ్రామదేవతల ఆలయాల పునరుద్ధరణకు కాలనీవాసులు ముందుకు రావడం ఎంతో అభినందనీయమన్నారు. ఆలయాల అభివృద్ధితో కాలనీలో ఆధ్యాత్మికమైన వాతావరణం నెలకొంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అంజయ్య గౌడ్, బాలయ్య, రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఆటంకంగా బీజేపీ నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న డివిజన్ అధ్యక్షుడు కటిక రెడ్డి అరవింద రెడ్డి

**బీఆర్ఎస్ బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షుడు అరవింద్ రెడ్డి**

వనస్థలిపురం, మే 2 : ఎల్బీనగర్ నియోజకవర్గంలో కొంతమంది బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు అభివృద్ధికి ఆటంకంగా మారుతున్నారని బీఆర్ఎస్ బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షుడు కటిక రెడ్డి అరవింద రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కృషితో ఎన్జీవోస్ కాలనీలో గ్రంథాలయ నిర్మాణానికి రూ.1.95 కోట్ల నిధులు మంజురయ్యాయన్నారు. గురువారం ఉదయం శంకుస్థాపన చేస్తే అక్కడ ఏ మాత్రం కూడా ప్రతిఘటించకుండా, ఫొటోలకు ఫోజులిచ్చి సాయంత్రం ఆ శిలాఫలకంలో ఎంపీ ఈటల రాజేందర్ పేరు చిన్న అక్షరాలతో పెట్టారనే నెపంతో పథకం ప్రకారం వాళ్ల అనుచరవర్గాన్ని తీసుకెళ్లి శంకుస్థాపన శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం నీతిమాలిన చర్య అన్నారు. ఈ సంఘటన ప్రజలను ఆశ్చర్యానికి గురి చేసిందని, ఎన్నో రోజులుగా ఈ పనులకు ఆటంకాలు కలిగిస్తున్నారని, ఎట్టకేలకు పనులు ప్రారంభం అయితే ఓర్వలేక మరోసారి అడ్డుపడుతున్నారని విమర్శించారు. ఈ హేయమైన చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అసలు వారికి కావాల్సింది పేర్ల పెత్తనమా? లేక అభివృద్ధా? అని ప్రశ్నించారు. చేసిన పని అభివృద్ధి కోసమైతే కాదు. మరి ఈ పేర్ల కోసం వీధి రౌడీల్లా ఇలాంటి చిల్లర పనులు చేయడం దారుణమని పేర్కొన్నారు. గత నెల మంత్రి శ్రీధర్ బాబు కొన్ని పనులను ప్రారంభించడానికి ఎల్బీనగర్‌కి వచ్చి ఆ శిలాఫలకాలలో స్థానిక ఎమ్మెల్యే పేరు కూడా కింద చిన్న అక్షరాలతో ఎక్కడో ఉంది.

అయినా కాని మంచి మనస్సుతో కలిసిపోయి మంచి వాతావరణంలో ప్రారంభోత్సవాలు చేశామన్నారు. పేర్ల కన్నా అభివృద్ధి ముఖ్యమనే భావనలోనే తాము పనిచేస్తున్నామన్నారు. చదువు సంస్కారం ఉన్నవారు ఎవరూ ఇలాంటి పని చేయరని, హుందాగా వ్యవహరిస్తారన్నారు.

డివిజన్ పరువు బజారుపాలు చేసిన కార్పొరేటర్ వెంటనే తన పదవికి రాజీనామా చేసి, బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చంపాపేట, మే 2: చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్న కారణంగా నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు. చంపాపేట 11 కేవీ ఫీడర్ పరిధిలోని సాయిరాం నగర్ కాలనీ, శిఖరఎన్ క్లేవ్, నాగార్జున కాలనీ, ఆర్టీసీ కాలనీ, భాను నగర్, కేశవ నగర్, సింగరేణి కాలనీ, రాఘవేంద్ర కాలనీలతో పాటు, సుల్తాన్ వాల్యా 11 కేవీ ఫీడర్ పరిధిలోని కటికోని కుంట, చంపాపేట ఓల్డ్ విలేజి, సాయిరాం కాలనీ, సుల్తాన్ వాల్యా, బస్తీ దవాఖాన, రాజిరెడ్డి నగర్ లలో ఉదయం 9 గంటల నుంచి, 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇదేవిధంగా శ్రీనివాస నగర్ 11కేవీ నుంచి సరఫరా అయ్యే ప్రాంతాలు గ్రీన్ పార్క్ కాలనీ, శ్రీనివాసనగర్ కాలనీ, శ్రీరామ్ కాలనీ, తపోవన్ కాలనీలలో ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోనున్నట్లు ఏఈ వెల్లడించారు.


**సైదాబాద్‌లో..**

సైదాబాద్, మే 2: విద్యుత్ మరమ్మతుల కారణంగా లక్ష్మీ నగర్ కాలనీ సబ్ స్టేషన్ 33/11కేవీ విజయనగర్ కాలనీ ఫీడర్ పరిధిలో శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చంపాపేట ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం 3: 30 గంటల నుండి సాయంత్రం 4 30 గంటల వరకు వినయ్ నగర్ ఫీడర్ పరిధిలోని కృష్ణా నగర్, వినయ్ నగర్, ఎన్ఎస్ఆర్ కాలనీ, బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్, శ్రీనివాస్ నగర్, బాలాజీ నగర్, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

**ఆస్మాన్ ఘాడ్ సబ్ డివిజన్ పరిధిలో...**

11కేవీ చంద్ర హట్స్, 11కేవీ శ్రీ వెంకటేశ్వర ఆలయం ఫీడర్ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు, 11కేవీ శాలివాహన నగర్,11కేవీ సిరిపురం కాలనీ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు, 11కేవీ సైదాబాద్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు ఆయా ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## విద్యలో రాణిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్



శ్రీలక్ష్మిని సన్మానిస్తున్న కృష్ణగౌడ్

కందుకూరు, మే 2 : విద్యార్థులు విద్యలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మండల పరిషత్ మాజీ వైస్ ఎంపీపీ కృష్ణగౌడ్ తెలిపారు. మండల పరిధిలోని వేముల కృష్ణ దంపతుల కూతురు శ్రీలక్ష్మి 10వ తరగతిలో 600 మార్కులకు గాను 585 మార్కులు సాధించి మండల టాపర్‌గా, రంగారెడ్డి జిల్లాలో రెండో స్థానంలో నిలువడంతో ఆయన శుక్రవారం విద్యార్థి ఇంటికి వెళ్లి శాలువాతో సన్మానించి స్వీట్లు తినిపించి ఆనందం వ్యక్తం చేశారు. చిన్నప్పటి నుంచి విద్యార్థిని విద్యలో రాణించినట్లు తల్లిదండ్రులు చెప్పడంతో సంతోషపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యలో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. తల్లిదండ్రులు ఆశయాలను నెరవేర్చడానికి పిల్లలు కృషి చేయాలని కోరారు. ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. విద్యను కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకోవాలని సూచించారు. సమాజంలో విద్యార్థులకు మంచి గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులను సన్మార్గంలో నడిపించి మంచి ఫలితాలను తీసుకువస్తున్న ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పల్లె వసంత, శ్రీనివాస్, శ్రీలక్ష్మి తండ్రి వేముల కృష్ణ దంపతులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో సైనిక్ స్కూల్స్ ఏర్పాటు చేయాలి

మేడ్చల్, మే 2: రాష్ట్రంలో సైనిక్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని సైనిక్ స్కూల్ తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. విభజన చట్టం ప్రకారం తెలంగాణకు కేంద్రం వరంగల్, కరీంనగర్ లకు సైనిక్ స్కూల్స్ మంజూరు చేసిందన్నారు. కానీ ఇప్పటి వరకు రాష్ట్రంలో నిర్మాణం జరుగలేదన్నారు. రాష్ట్రానికి చెందిన విద్యార్థులను ఆంధ్రప్రదేశ్‌లోని కోరుకొండ, కలికిరి సైనిక్ స్కూల్స్‌లో స్థానికేతరులుగా గుర్తిస్తూ సైనిక్ స్కూల్స్ సొసైటీ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దీంతో తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి రాష్ట్రంలో సైనిక్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సైనిక్ స్కూల్ పేరెంట్స్ పూటుకూరి మల్లేశం, కొర్వి పోచయ్య ముదిరాజ్, బాపురెడ్డి, బుస్స శ్రీనివాస్ గుప్త, అడ్వకేట్ సత్యనారాయణ, అడ్వకేట్ రాజశేఖర్ రెడ్డి, బి.నాగేష్ తదితరులు ఒక ప్రకటనలో కోరారు.

## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

బాలానగర్, మే 2:కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఆడబిడ్డల తల్లిదండ్రులకు ఓదార్పునిస్తున్నాయని కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం బాలానగర్ మండల కార్యాలయంలో తాసిల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయనతోపాటు కార్పొరేటర్లు ముద్దం నరసింహ యాదవ్, పండాల సతీష్ గౌడ్, ఆవుల రవీందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా 140 చెక్కులను వారు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆడబిడ్డల పెండ్లికి సాయపడేందుకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన గొప్ప సంక్షేమ పథకం కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ అన్నారు. ఆడపడుచుల వివాహానికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఎంతో ఆసరాగా నిలిచాయని తెలిపారు.

# పాడి రైతుల పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలి

- తెలంగాణ పాడి రైతు సంఘం



హయత్‌నగర్‌లో మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ రాష్ట్ర పాడి రైతు సంఘం నాయకులు

హయత్ నగర్, మే 2 : మదర్ డెయిరీ సంస్థ పాడి రైతుల పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని తెలంగాణ పాడి రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం హయత్ నగర్‌లోని మదర్ డెయిరీ సంస్థ చైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డికి తెలంగాణ పాడి రైతు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ పాడి రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ వంగ నరసింహులు, కో కన్వీనర్ పెసరకాయల జంగారెడ్డి మాట్లాడుతూ, మదర్ డెయిరీ సంస్థ గత మూడు నెలలుగా పాడి రైతుల వద్ద పాలు సేకరించిన డబ్బులు రూ.64 కోట్ల చెల్లించాల్సి ఉండగా వాటిని చెల్లించకుండా బాధిత రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మదర్ డెయిరీ 15 రోజులకు ఒకసారి బిల్లులు చెల్లించాల్సి ఉండగా గత మూడు నెలలుగా బిల్లులు చెల్లించకుండా రైతులను అప్పుల పాలు చేస్తున్నారని మండిపడ్డారు. అనేక మంది రైతులు మదర్ డెయిరీ సంస్థకు పోస్తున్న పాలను ఇతర డెయిరీలకు డైవర్ట్ అవుతున్నారని, దీనికి పాలకవర్గమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. మదర్ డెయిరీని నిర్వీర్యం చేయడానికే పాలకవర్గం కుట్ర పన్నిందని ఆరోపించారు. తక్షణమే రైతుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరారు. లీటరుకు రూ.5 లు ప్రోత్సాహకాన్ని వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలన్నారు. 50 శాతం సబ్సిడీపై పాడి సంరక్షణ మందులు, గడ్డి విత్తనాలు ఇవ్వాలని, పాలు టెస్టర్లు, చాఫ్టర్లు మిల్క్ అనలైజర్లు సరఫరా చేయాలని కోరారు. పశుపోషణ పథకాన్ని అమలు చేస్తూ ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించాలన్నారు. మొబైల్ వ్యాన్లు ఏర్పాటు చేసి రైతుల ఇంటి వద్దకే పశు వైద్య సౌకర్యం కల్పించాలని, రైతుల పిల్లలను ఇంటర్ వరకు చదువుకునేందుకు ప్రోత్సహించడానికి సబ్సిడీ ఇవ్వాలని, ఉన్నత విద్యా చదువు వరకు చదువుతున్న పిల్లలకు స్కాలర్షిప్ లు ఇవ్వాలన్నారు. పశువుల దానాలు సబ్సిడీపై అందించాలని, పాడిని ఉత్పత్తి చేసే రైతులకు వ్యక్తిగత భీమా సౌకర్యం కల్పించి, ప్రీమియమును ప్రభుత్వమే చెల్లించాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పాడి రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు సంధిలా భాస్కర్ గౌడ్, దొంతరి సోమిరెడ్డి, జిల్లా కోశాధికారి మాటూరి బాలరాజు గౌడ్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బండి నాగయ్య, జిల్లా నాయకులు బి మధుసూదన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, శివ శంకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పూసల సంఘం నూతన కమిటీ ఎన్నిక



సైదాబాద్ పూసల సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు గెలుపు పత్రాలు అందజేస్తున్న ఎన్నికల అధికారులు

సైదాబాద్, మే 2: సైదాబాద్ పూసల సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. ఎన్నికైన సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడిగా ఎన్నికైన కావేటి వెంకట శర్మ మాట్లాడుతూ, ఎన్నికైన కమిటీ సభ్యులందరూ కలిసికట్టుగా పూసల కుల సంఘం అభివృద్ధికి పాటుపడతామని, సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కమిటీ ఉపాధ్యక్షులుగా కావేటి పృధ్వీ కృష్ణ (కేపీ), నల్లబోలు శర్వాన్ నాయుడు, ప్రధాన కార్యదర్శిగా కావేటి రవీందర్, సంయుక్త కార్యదర్శి కావేటి నరసింహ, కావేటి రామదాసు, కార్యదర్శులుగా పసుపులేటి కృష్ణ, తన్నీరు రామారావు, కోశాధికారి ముద్దబోయిన శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

### కందుకూరు జెడ్పీ పాఠశాల
## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అలనాటి ఉపాధ్యాయులతో విద్యార్థులు

కందుకూరు, మే 2: ఆనందోత్సవాల మధ్య పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 20 ఏళ్లకు ఒకే చోట కలుసుకొని ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు. 2004–2005వ విద్యా సంవత్సరంలో కందుకూరు జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థినీ, విద్యార్థులు మండల కేంద్రంలోని ఓ రిసోర్ట్స్‌లో సమావేశం అయ్యారు. అలనాటి ఉపాధ్యాయులను ఆహ్వానించి సన్మానించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సమావేశానికి కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. అంతా కలిసి సహపంక్తి భోజనం చేశారు. అలనాటి ఉపాధ్యాయులు చంద్రమోహన్ రెడ్డి, ఆనంద్ కుమార్, అయూబ్, కరుణాకర్, లక్ష్మారెడ్డి, లక్ష్మి, కనుక మహాలక్ష్మి, నరసింహ గౌడ్, విద్యార్థులు శేఖర్, ఉదయ్ ముదిరాజ్, బొక్క సురేందర్ రెడ్డి, బొడ్డు మహేందర్ రెడ్డి, గుర్రేంకల రామకృష్ణ, ముదిరాజ్, ప్రభాకర్, ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## చిత్రలేఅవుట్ కాలనీ సీనియర్ సిటిజన్ కార్యవర్గ సమావేశం



అంజిరెడ్డి సత్కరిస్తున్న సీనియర్ సిటిజన్ సభ్యులు

ఆర్కే పురం, మే 2 : ఆర్కే పురం డివిజన్ చిత్రాలేఅవుట్ కాలనీ సీనియర్ సిటిజన్ కార్యవర్గ సమావేశం రావుల నరసింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదించారు. ఏప్రిల్ నెలలో జన్మించిన ముసుకు అంజిరెడ్డిని సీనియర్ సిటిజన్ కమిటీ సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా రావుల నరసింహారెడ్డి మాట్లాడుతూ, సభ్యులు తమ వంతు సంఘం అభివృద్ధికి తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో నారాయణరెడ్డి, నర్సింగరావు, రామచంద్రరావు, ఇంద్రసేనారెడ్డి, మధుసూదన్ రెడ్డి, ఉదయ్ శంకర్ రెడ్డి, తదితరులు తెలిపారు.

## దాడి చేసిన వ్యక్తి రిమాండ్

**కుత్బుల్లాపూర్, మే 2:** రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఇద్దరిపై ఓ వ్యక్తి మద్యం మత్తులో దాడి చేయగా.. ఆ వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన సంఘటనపేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది.సుభాష్‌నగర్ ప్రాంతానికి చెందిన అబ్దుల్ హాసిం గత నెల 29వ తేదీన సాయంత్రం తన స్నేహితుడితో కలిసి పీబీ ఇంజినీరింగ్ వర్క్స్ కంపెనీ సమీపంలో రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో వెనకాల నుంచి సుభాష్‌నగర్ ప్రాంతానికి చెందిన కొత్తగూడ సాయి తేజ(31) మద్యం మత్తులో ద్విచక్ర వాహనంపై వెళ్తూ నడుచుకుంటూ వెళ్తున్న వారిని ఢీకొట్టాడు. అనంతరం సాయితేజ వారిపై దాడి చేశాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

## ఘట్‌కేసర్‌లో దంచికొట్టిన వర్షం

ఘట్‌కేసర్, మే 2: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ తోపాటు పలు గ్రామాల్లో శుక్రవారం ఉరుములు, మెరుపులు, గాలి దుమారంతో వాన దంచికొట్టింది. ఘట్‌కేసర్ పట్టణంతో పాటు ఎన్ ఎఫ్‌సీనగర్, అవుషాపూర్, అంకుషాపూర్, ఎదులాబాద్, ఘనపూర్, మర్రిపల్లిగూడలో సాయంత్రం గాలి దుమారం వచ్చి ఒక్కసారిగా వర్షం కురిసింది. దీంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డపై వర్షం నీరు నిలవడంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. గాలి రావటంతో చెట్లు కూలిపోయాయి.

### రోడ్డు ఆక్రమణల తొలగింపు

దుండిగల్, మే 2: దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో రోడ్డు ఆక్రమణలను హైడ్రా అధికారులు మున్సిపాలిటీ సిబ్బందితో కలిసి శుక్రవారం తొలగించారు. మున్సిపాలిటీ పరిధి, బహదూర్‌పల్లిలో పలు ఆక్రమణలను తొలగించిన అధికారులు బౌరంపేట, సింహపురి కాలనీలోని బౌరంపేట–వీఎన్ఆర్ కాలేజ్ రోడ్‌లో రోడ్డును ఆక్రమించి వెలసిన ప్రహరీ గోడలను జేసీబీలతో తొలగించారు. ఇక్కడ ప్రస్తుతం అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో రోడ్డు ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. కార్యక్రమంలో హైడ్రా సిబ్బందితోపాటు దుండిగల్ మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

**PUBLIC NOTICE**

General Public hereby call upon you that my client **KATHULA SRINIVAS,** S/o. Late K.Laxmaiah and **KATHULA LATHA,** W/o. Kathula Srinivas, R/o. D.No. 2-3-792/13/A, Shanthinagar, Golnaka, Amberpet, Hyderabad, TG, intends to purchase the property H.No. 11-5-118 (Old), New No. 11-6-24 (PTIN No. 1031101063) adm. 390.00 Sq.yds. or 326.08 Sq.mtrs., Ground Floor with built-up area 500 Sq.ft. (ACC), situated at Venkateshwara Colony, Saroornagar, L.B.Nagar, Ranga Reddy Dist., TG, in this property of Northern Part is purchasing the Kathula Srinivas and Southern part is purchasing the Kathula Latha from its owner Aarajula Venkata Ramesh, S/o. A.Bhasker Raju through its GPA holders Alegeti Krishna and A.Mohan Rao, R/o. Hyderabad, TG, for valid sale consideration amount and entered into an agreement of sale and paid part sale consideration amount to the owner/GPA Holders, this is to inform the general public and all concern if anybody having objections by persons, Financial Institutions etc., if entered into any prior Agreements, Deed or Deeds with the above said persons, the objection will be raised within Fourteen days (14 days) form the date of publish of this Notice with strict proof of documentary evidence and contact in the below said address, otherwise my clients will pay the balance sale consideration and complete the Registration formalities. Whoever wants to challenge this public notice shall challenge in writing within Fourteen days (14 days) from the date of this Public Notice and all the correspondence after the prescribed period shall not be considered and treated as null and void.

**Sd/- POTHAMSHETTY NAGESH,**
**M. RAJITHA, Advocates**
H.No. 3-5-385, Flat No. G-1,
Omsree RK Enclave, Vittalwadi, Narayanaguda,
Hyderabad-29, **Cell: 9885317896, 9391038203.**
Place: Hyderabad, Date: 02-05-2025.